క్లుప్తంగా

శని త్రయోదశి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న వీరభద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో శనేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు శనిత్రయోదశి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని గంగా పార్వతి నగరేశ్వర స్వామి దేవాలయంలో అర్చకుల ఆధ్వర్యంలో శనేశ్వర పూజలు జరిగాయి. వివిధ దేవాలయాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు గాదె బాలరెడ్డి మృతి



రెంటచింతల: రెంటచింతల సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె బాలరెడ్డి(89) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఆయన రెంటచింతల పాలకేంద్రం అధ్యక్షుడిగా కూడ పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి అనుచరుడిగా, సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరు పొందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. బాలరెడ్డి మృతిపై ప్రభుత్వ విప్, పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఫోన్లో విచారం వ్యక్తంచేసి, వారి కుటంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు అల్లం ప్రతాప్‌రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, పార్టీ నాయకులు గాదె కిరీటిరెడ్డి, అల్లం ఇన్నారెడ్డి తదితరులు బాలరెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

నేడు రంగా విగ్రహావిష్కరణ

గురజాల: వంగవీటి మోహన్ రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యుడు జి.సురేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వంగవీటి రాధా పాల్గొంటారన్నారు. పార్టీలకతీతంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఎస్‌ఎంసీ చైర్మన్ బాబూరావుకు సత్కారం



బాబూరావును సత్కరిస్తున్న ఏఐఎం నాయకులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన పెండెం బాబూరావును అంబేడ్కర్ ఇండియా మిషన్(ఏఐఎం) ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కేబీఆర్‌జే ప్రసాద్, ఎన్‌పీ ప్రసాద్‌రాజు, తురకా రాజు, ఇంటి ప్రాన్సిస్, నేలటూరి రమేష్, చిన్నయ్య, జాన్పాల్, దారా జాషువా, లూర్దయ్య, పాస్టర్ స్వరూప్, రామారావు, రత్నం, రాంప్రసాద్, స్టాలిన్, నాని ఉన్నారు.

ఆదర్శప్రాయుడు తల్లం బ్రహ్మయ్య

అమరావతి: కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం, ఆశయాల కోసం నిరంతరం పనిచేసిన కామ్రేడ్ తల్లం బ్రహ్మయ్య భావితరానికి ఆదర్శ ప్రాయంగా నిలుస్తారని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో తల్లం బ్రహ్మయ్య సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అధ్యక్షత వహించారు. పాశం రామారావు మాట్లాడుతూ తల్లం బ్రహ్మయ్య తన జీవితమంతా కమ్యూనిష్టు సిద్ధాంతాల కోసం ఆశయాల సాధనకోసం పనిచేశారన్నారు. భవిష్యత్‌లో బ్రహ్మయ్యను ఆదర్శంగా తీసుకుని సీపీఎం. కార్యకర్తలంతా పేదల అభివృద్ధి కోసం నిరంతరం పాటుబడాలన్నారు. ఈసభలో సీపీఎం నాయకులు గంజిమాల రవిబాబు, యూటిఎఫ్ సీనియర్ నాయకులు గుంటుపల్లి కోటేశ్వరరావు, సయ్యద్ మోహిద్దీన్‌లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సర్వం.. హరనామ స్మరణం



సత్రశాలలో గర్భాలయంలో పూజలు అందుకుంటున్న మల్లన్నస్వామి

- సత్రశాలకు పోటెత్తిన భక్తులు
- శివనామ స్మరణతో పులకించిన సత్రశాల



ప్రత్యేకపూజలు చేస్తున్న పీఆర్కే దంపతులు, పీవీఆర్ దంపతులు

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన ప్రముఖశైవక్షేత్రం సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లన్నస్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువ జామునుంచే వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి దేవస్థానానికి సమీపంలోని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించి మల్లన్నస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఫెస్టివల్ చీఫ్ ఆఫీసర్ లీలావతి, ఈఓ గాదె రామిరెడ్డి పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు కల్పించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు చిట్యాల మల్లిఖార్జునశర్మ నేతృత్వంలో పలువురు వేదపండితులు ప్రత్యేక పూజలు, స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబ అమ్మవారికి శ్రీ చక్రనవవర్ణ అర్చన, కుంకుమార్చనలు, గంగ పూజ, మంగళస్నానాలు, ఖడ్గ ప్రదర్శన, అఖండ దీపారాధన నిర్వహించారు. సత్రశాలకు 65వేల మంది భక్తులు తరలిరాగా సుమారు 11వేల మందికి పైగా భక్తులు దైవదర్శనం చేసుకుని ఉంటారని ఈఓ తెలిపారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ డైరెక్టర్ శౌంఠిరెడ్డి నల్ల నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత మోర్తల ఉమ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పూజల రామయ్య, యూత్ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, సత్రశాల మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు వేముల పిచ్చయ్య, చల్లా మట్టారెడ్డి, కట్టమూరి వెంకటనాగేశ్వరరావు, దుర్గి యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి తదితరులు దేవస్థానంను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ సయ్యద్ షమీర్ బాష నేతృత్వంలో పోలీసులు, మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ పిచ్చయ్య పలు కూడలలో సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా భద్రతచర్యలు చేపట్టారు. దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మూడు విద్యుత్ ప్రభలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఒక ప్రభ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశత్తు విరగడంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. పాట కచేరీలు, భజనా కార్యక్రమాలతో జాగారం చేసే భక్తులకు కాలక్షేపం అయ్యింది.



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి దంపతులు

ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక పూజలు

అతిప్రాచీనమైన పవిత్ర శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దంపతులతోపాటు, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి ట్రస్టుబోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఈఓ గాదె రామిరెడ్డి నేతృత్వంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు చిట్యాల మల్లిఖార్జునశర్మ పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భ్రమరాంబికాదేవి ఆలయంలో కూడా పూజలు చేశారు. ఎమ్మెల్యే పీఆర్కే దంపతులను, పీవీఆర్ దంపతులను పూలమాలవేసి దుశ్శాలవతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ శ్రీశైలం, కోటప్పకొండ, సత్రశాల దేవస్థానాలను సందర్శించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మల్లిఖార్జునస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రంలోని అర్హులైన పేదప్రజలకు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను అందిస్తూ వారు సుఖసంతోషాలతో జీవించాలని మనసా వాచ కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, జెట్టిపాలెం సర్పం దావులూరి ఉదయ కుమారి రమేష్, యూత్ అధ్యక్షులు గొట్టం చిన్న బ్రహ్మారెడ్డి, పార్టీ నేతలు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, చల్లా మట్టారెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి



పిడుగురాళ్ల: యువత క్రీడలపై శ్రద్ధ చూపాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ వినీత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో భారత వనిత వారపత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కార్క్‌బాల్ టోర్నమెంట్ ఏడో రోజు పోటీలకు యూనియన్ బ్యాంక్ మేనేజర్ వినీత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ప్రతి ఒక్కరు మక్కువ చూపించాలన్నారు. మొదటి మ్యాచ్‌లో భార్గవ సీసీ, కొండమోడు వివేకానంద సీసీ మధ్య మ్యాచ్ జరగా కొండమోడు వివేకానంద సీసీ గెలుపొందింది. రెండవ మ్యాచ్‌లో మనోజ్ సీసీ, లైమ్ సిటీ జట్లు తలపడగా మనోజ్ సీసీ విజయం సాధించగా, మూడవ మ్యాచ్‌లో దాచేపల్లి, జానపాడు జట్ల మధ్య పోటీ జరగ్గా జానపాడు జట్టు విజయం సాధించింది. వనిత శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మురళీ, నాయక్, నిరంజన్, వెలిశల గంగాధర్‌రావు(నాని), రత్నం, రవి, వీరయ్య తదితరులు ఉన్నారు.

21న జిల్లా పరిషత్ దుకాణాల వేలం

గురజాల: ఈ నెల 21వ తేదీన బస్టాండ్ ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ షాపింగ్ దుకాణాల వేలం నిర్వహించడం జరుగుతుందని ఎండీపీఓ ఫణికుమార్ తెలిపారు. మొదటి అంతస్తుపై గల 5 దుకాణాలకు మాత్రమే వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు వేలం జరుగుతున్నట్లు తెలిపారు.

హరహర మహాదేవ.. శంభోశంకర

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

గురజాల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. పట్టణంలో వేంచేసియున్న అమరలింగేశ్వర స్వామి దేవాలయం, ముక్కంటేశ్వర స్వామి దేవాలయం, గంగా పార్వతీ సమేత ఇష్టకామేశ్వరస్వామి దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అదే విధంగా జంగమహేశ్వరపురం గ్రామంలోని కోనేరు వద్ద వేంచేసియున్న శివాలయంలో భక్తులు బారులుతీరారు. మండల పరిధిలోని దైద గ్రామంలో కృష్ణానది తీరాన వేంచేసియున్న అమరలింగేశ్వర స్వామి దేవాలయం భక్తులతో పోటెత్తింది. వేకువ జాము నుంచి భక్తులు వెళ్లి కృష్ణానదిలో స్నానమాచరించి బిలంలో కొలువైవున్న అమరలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాకారమునకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతి నీలకంఠేశ్వర స్వామి వారి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సీఐ కె.ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎస్ఐలు అశోక్‌కుమార్, బి.అనంతకృష్ణలు తగు చర్యలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గణపతి సురేష్ ఏర్పాట్లును పరిశీలించారు. దైద, గోగులపాడు గ్రామాల్లో స్వామి వార్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ)లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాచర్లలో...

మాచర్ల: పట్టణ శివారులోని జమ్మలమడక రహదారిలో వేంచేసియున్న రామప్ప దేవాలయంలో వందలాది మంది భక్తులు బారులు తీరి స్వామివారికి అభిషేకాలు చేశారు. స్వామివారికి పంచామృతంతో అభిషేకాలు జరిపి దర్శించుకొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పాత మాచర్లలో వేంచేసియున్న గంగాపార్వతి నగరేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుఝాము నుంచే అర్చకులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు దేవాలయంలో బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలోని వీరభద్ర స్వామి ఆలయంలో తెల్లవారుఝాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అర్చకులు ఆశీర్వదించారు. పట్టణంలోని రింగురోడ్డు సెంటర్ నుంచి సాగర్‌కు వెళ్లే రహదారిలో శివాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. అదే విధంగా కస్తూరిబా ఆశ్రమ పాఠశాల వెనుక భాగంలో బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏలేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

విజయపురిసౌత్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పుణ్యక్షేత్రమైన ఏలేశ్వరస్వామి ఆలయానికి అనుపు నుంచి పర్యాటక లాంచీల్లో శనివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అర్చకుడు శ్రీపాద సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి 12గంటలకు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఏలేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తడంతో మాచర్ల రూరల్ సీఐ షేక్ సమీముల్లా పర్యవేక్షణలో విజయపురి సౌత్ ఎస్ఐ పి.అనిల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుపు వద్ద భారీగా లాంచీలలో తరలివెళ్లడంతో పర్యాటకశాఖకు రూ.3.12లక్షల ఆదాయం సమకూరింది. పర్యాటకశాఖ డీవీఎం సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కలిపించారు.



గంగాపార్వతి నగరేశ్వరస్వామి దేవాలయంలో మూలవిరాట్‌ను అలంకరించిన దృశ్యం



కంచరగుంటలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

కారెంపూడిలో...

కారెంపూడి: మహాశివరాత్రి పర్వదినం శనివారం నాడు మండలంలోని ఒప్పిచర్ల గ్రామ శివారు నల్లమల అడవిలో వేంచేసి ఉన్న ధనమల్లయ్య స్వామి చెంతకు భక్తులు భారీగా తరలి వచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో అర్చకులు భక్తులపేరిట పూజలు చేసి తీర్థప్రసాదాలు ఇచ్చారు. అక్కడ మహాన్నదానంజరిగింది. అలాగే చినగార్లపాడు గ్రామంలో ముక్కంటేశ్వరస్వామి సన్నిధిలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని గ్రామాభివృద్ధి కమిటీ నిర్వహించింది. కార్యక్రమ నిర్వహణలో కమిటీ చైర్మన్ కాసులనాటి శేషాద్రి, సర్పంచ్ బద్దూరి బుజ్జి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే మిరియాల, పెద కొదమగుండ్ల, చింతపల్లి, కారెంపూడి గ్రామాలలో ఉన్న శివాలయాలకు కూడా భక్తులు భారీగా తరలి వచ్చారు.

దుర్గిలో...

దుర్గి: మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం తేరాల సిద్దేశ్వర ఆలయంలో బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయం, ధర్మవరంలోని బుగ్గమల్లయ్య స్వామి ఆలయాలలో మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కంచరగుంటలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. పలు శివాలయాలులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు జాగారం చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గి శివాలయంలో మల్లిఖార్జున స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

మహాశివరాత్రి ప్రత్యేక పూజలు



శ్రీశైలం దేవస్థానంలో స్వామిని దర్శించుకున్న పీఆర్కే, పీవీఆర్ కుటుంబ సభ్యులు

మాచర్ల: మహాశివరాత్రి పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం దేవస్థానాన్ని శనివారం తెల్లవారుఝామున సందర్శించారు. అదే విధంగా పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, సత్రశాలతో పాటు పలు శివాలయాలు దర్శించుకొని శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



దైద బిలంలో కొలువై వున్న స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



అనుపు నుంచి లాంచీలో ఏలేశ్వరస్వామి ఆలయానికి వెళ్తున్న భక్తులు

వెల్దుర్తిలో...

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాల్లో శివరాత్రిని పురస్కరించుకొని శివనామస్మరణ మార్మోగింది. గొట్టిపాళ్ళ గ్రామంలో వేంచేసియున్న భక్తమార్కండేయ స్వామి వారి ఆలయంలో అర్చకుడు జిగురు శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గుండ్లపాడు ఉమామహేశ్వరాలయం, శిరిగిరిపాడు శివాలయం, ఉప్పలపాడులో బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. గొట్టిపాళ్ళలో కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ దేవాలయాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

దాచేపల్లిలో...

దాచేపల్లి: మహా శివరాత్రి సందర్భంగా శనివారం భక్తులతో శివాలయాలు కిక్కిరిశాయి. మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామ సమీపంలోని కొండపైన కొలువైన సారంగధరేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తిరునాళ్ల మహోత్సవం కూడా ఘనంగా నిర్వహించారు. విద్యుత్ ప్రభలను కట్టుకుని భక్తులు కొండపైకి తెచ్చారు. స్వామివారి వార్షిక కల్యాణంను ఘనంగా జరిపించారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ ఎంపీపీ కందుల జాను, సొసైటీ చైర్మన్ బత్తుల లింగారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆలయ కమిటీ సభ్యులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

పిడురాళ్లలో....

పిడుగురాళ్ల: పట్టణంలో మహాశివరాత్రి పండుగను పట్టణంలోని ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఉదయానే భక్తులు పట్టణంలోని శివాలయం, గంగమ్మతల్లి దేవస్థానం, బోళాలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్వామివార్లను వివిధ అభిషేకాలు నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. ఆలయాలు ఉదయం 8 గంటల నుంచి భక్తుల రాకతో కిక్కిరిసి పోయాయి.

మాచవరంలో...

మాచవరం: మహా శివరాత్రి పురస్కరించుకుని శనివారం మండలంలోని మోర్జంపాడు శివారులోని బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు వేలాది సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. గురజాల ఆర్‌డీఓ అద్దెయ్య స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు, వ్యాపార, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

పక్కా గృహాలపై సంపూర్ణ హక్కు పొందండి

ఏఎంసీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి



సంపూర్ణ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, సర్పంచి వీరబాబు

అచ్చంపేట: ఓటీఎస్ విధానం ద్వారా పక్కా గృహాలపై సంపూర్ణ హక్కు పొందేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి చక్కటి అవకాశాన్ని కల్పించారని ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్‌ఎస్సార్కే సాయిరెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలోని సచివాలయం-1 పరిధిలో ఓటీఎస్ ద్వారా రుణాలు చెల్లించిన 90మంది లబ్ధిదారులకు సంపూర్ణ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచి కంబాల వీరబాబు అధ్యక్షత వహించారు. సాయిరెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం హయాంలో జరగని విధంగా లబ్ధిదారులు రుణ విముక్తులయ్యేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. ఉప సర్పంచ్ షేక్ జాని, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, ఓటీఎస్ లబ్ధిదారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు



అదుపుతప్పి పంటకాలువలో దూసుకెళ్లిన కారు

నకరికల్లు: అదుపుతప్పిన కారు పంటకాలువలోకి దూసుకెళ్లింది. ప్రయాణికులకు ప్రాణహాని తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన మండలంలోని దేచవరంకుంట సమీపంలో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి.. కారంపూడికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కారులో గుంటూరుకు బయలుదేరారు. మార్గంమధ్యలో నర్సింగపాడు ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకుని తిరిగి బయలుదేరారు. దేచవరంకుంట సమీపంలోకి వచ్చేసరకి వాహనం నడుపుతున్న వ్యక్తి నిద్రమత్తులో ఉండడంతో కారు అదుపుతప్పి కుడివైపున రోడ్డుపక్కనే ఉన్న పంటకాలువలోకి దూసుకెళ్లింది. దాదాపు 50మీటర్ల మేర కాలువనీటిలోకి దూసుకెళ్లింది. గమనించిన సమీపంలోనివారు కారులోని ప్రయాణికులను ఒడ్డుకు చేర్చారు. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలుకాలేదు. కారులో అందరూ క్షేమంగా భారీప్రమాదం నుంచి బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.

అడిగొప్పలలో పారిశుద్ధ్య పనులు



ముమ్మరంగా జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

దుర్గి: మండల పరిధిలోని అడిగొప్పల గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న సైడు కాల్వలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించి గ్రామంలో స్వచ్ఛతకు, శుభ్రతకు శ్రీకారం చుట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి దష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే సంబంధిత విషయంపై చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దానిలో భాగంగా డ్రైనేజీ వాటర్, పాడైపోయిన కాల్వలను, కచ్చా డ్రైన్‌లను ఏర్పాటు చేసి డ్రైనేజీ వాటర్‌కు అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేశారు. వడ్డెర బజారు వద్ద గల కొత్త సచివాలయం బిల్డింగ్ వరకు సైడ్ కాల్వ పూడిక తీసి దుర్గి వైపు గల ఈద్గా వరకు ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డు మార్జిన్, బుష్ క్లియరెన్సు, రోడ్డు ఎడమ వైపున ఫుట్ ఎక్స్‌టిన్షన్‌ను చేశారు. మొత్తం శుభ్రం చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ ప్రభ విరిగిపడి కార్మికుడికి గాయాలు



విద్యుత్ ప్రభ మధ్యకు విరిగిన దృశ్యం

రెంటచింతల: జెట్టిపాలెం గ్రామానికి చెందిన భక్తులు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ప్రభ మధ్యలో విరిగి ప్రభను నిర్మిస్తున్న ఓ కార్మికుడుపై పడి గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సయ్యద్ షమీర్‌బాష తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సత్రశాల దేవస్థానం ఆవరణలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యుత్ ప్రభను నిర్మిస్తుండగా, అక్కడ పనిచేస్తున్న కార్మికుడు శ్యామ్‌పై ప్రభ విరిగి పడడంతో గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడైన శ్యామ్‌ను ఏపీ జెన్‌కో అంబులెన్స్ వాహనంలో మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాష తెలిపారు.

ఫిట్ ఇండియా పోటీలకు కేవీ విద్యార్థులు

సత్తెనపల్లి: ఫిట్ ఇండియా రాష్ట్రస్థాయి పోటీలకు సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.కిరణ్‌రెడ్డి శనివారం తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రతి ఏడాది క్రీడా సంబంధమైన మరియు ఫిట్నెస్‌కు సంబంధించిన అంశాలలో నిర్వహించే ఫిట్ ఇండియా క్విజ్‌కు దేశవ్యాప్తంగా నిర్వహించే పరీక్షల్లో సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం విద్యార్థినులు ఇద్దరు ఎంపికయ్యారు. పాఠశాలలో పదవతరగతి చదువుచున్న జొన్నలగడ్డ అను 4వ ర్యాంక్, తొమ్మిదవ తరగతి చదువుతున్న రమావత్ పార్థవి సాయినవ్యశ్రీ 19వ ర్యాంక్ సాధించి తరువాత స్థాయి పరీక్షకు ఎంపికైనట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి స్టేట్‌రౌండ్‌కి 16 పాఠశాలలు ఎంపిక కాగా, అందులో సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం ఉందన్నారు.

మహారాజశ్రీ గురజాల 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

GWOP. 55/2023

పిటీషన్
కనిగిరి శ్రీనివాసరావు -పిటీషనరు
మరియు
1. కనిగిరి లినీస్‌కుమారి
2. కనిగిరి కృష్ణ గంగ స్వజన -రెస్పాండెంట్

పై నెంబరు పిటీషనరులో శ్రీకోర్టువారు జారీ చేసిన గార్డియన్ GWOP.55/2023 లో పిటీషనరు అయిన కనిగిరి శ్రీనివాసరావు గ్రామములో నివాసం ఉంటున్న కనిగిరి శ్రీనివాసరావు గారి షెడ్యూలు దాఖలా స్థిరాస్తులు అయిన D.No.193/C పిడుగురాళ్ళ పట్టణంలో 102.08 చ॥గ॥ల RCC డాబా ఇంటికి హద్దులు.
అయిటం నెం.1:- తూర్పు: 43.1 అ॥ మద్దాళి లక్ష్మీ సామ్రాజ్యం ఆస్తి, దక్షిణం: 21 అ॥ యక్కల బ్రహ్మానందం వగైరాల ఆస్తులు, పడమర: 43.9 అ॥ భవిరిశెట్టి సూర్య నారాయణ వగైరాలు, ఉత్తరం: 21.3 అ॥ కొలిశెట్టి ఆంజనేయులు ఆస్తి మరియు రెండవ అయిటం
అయిటం నెం.2:- డిటో గ్రామం, D.No.193/C లో 62.96 చ॥గ॥ లోగిలి, డోర్ నెం.8-267కి హద్దులు.తూర్పు:92అ॥ మద్దాళి లక్ష్మీ సామ్రాజ్యం ఆస్తి, దక్షిణం: 6.2 అ॥ అయిటం నెం.1ఆస్తి, పడమర: 92అ॥ కొలిశెట్టి ఆంజనేయులు వగైరాల ఆస్తి, ఉత్తరం: 6.2 అ॥ మాచర్ల-గుంటూరు రోడ్డు
పై నెంబరులో శ్రీ కోర్టువారు జారీ చేసిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి పిటీషనరు అయిన కనిగిరి శ్రీనివాసరావు S/o వుల్లారావు సా॥ పిడుగురాళ్ళ వారు ప్రణతి వెంకటకృష్ణ లక్ష్మీ సహస్ర యొక్క చదువు నిమిత్తము మరియు వివాహములకు గాను మరియు వగైరాలకు ఇంకా ఇతర ఖర్చులకు గాను ఉపయోగించుటకు గాను ఆ షెడ్యూల్డ్ దాఖలా స్థిరాస్తి అమ్ముకొనుటకు ఎవరికైన అభ్య అటంకములు ఉన్న యెడల ది.03-03-2023వ తేదీన కోర్టులో వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపగోరుచున్నాము. అట్లు కానీ ఎడల పరోక్షముగా తీర్మానించ బడునది ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కరణం కాశీ విశ్వనాథం
పిటీషనరు తరపు న్యాయవాది, గురజాల.
ఫోన్: 9440846381